# మాధవ(గాడు)రావు M.A.

– తన్నీరు శ్రీనివాసరావు

సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్తూ, కూరగాయలు తీసుకుందుకు మార్కెట్‌కి వెళ్ళాను. మార్కెట్ నుండి వచ్చేదారిలోనే అరటిపళ్ళు తీసుకుందుకు ఒక బండి దగ్గర ఆగాను. పాతికేళ్ళ కుర్రాడు. హుషారుగా బేరం అమ్ముతున్నాడు. వాడు నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. అయితే వాడు నన్ను గుర్తుపట్టలేదనుకుంటా, ''ఏంటిసార్! కాయలిమ్మంటారా?'' అని అడిగాడు. వాడికి నేనెవరో, నేను ఇప్పుడేం చేస్తున్నానో మొత్తం చెప్పాలనిపించింది. కాని ఇంతలోనే మళ్ళీ వాడు ''ఎన్నివ్వమంటారు సార్? డజనా? పాతికా?'' అని అనడంతో, ''పాతికివ్వు. ఎంత?'' అని డబ్బులిచ్చాను. సాయంత్రం కదా! బేరంటైము. ఇంకా ఇద్దరు, ముగ్గురు బండి దగ్గరికి వచ్చారు. ఇక వాడితో అప్పుడు మాట్లాడటం కుదరదని ఇంటిదారి పట్టాను.

రాత్రి భోజనం ముగించిన తర్వాత, శ్రీమతిచ్చిన అరటిపండుని తీసుకుని, తోలుతీస్తుండగా సాయంత్రం బండి దగ్గర కనబడిన కుర్రాడు చటుక్కున గుర్తుకొచ్చాడు. వాడినెందుకు మరిచిపోతాను నేను. ఒకరకంగా నేనివ్వాల్టి రోజున ఎ.పి.పి.ఎస్.సి. గ్రేడ్-1 ఆఫీసర్‌గా సంఘంలో మంచి హోదా, పలుకుబడి గల వ్యక్తిగా ఉన్నానంటే దానిక్కారణం వాడే. వాడు ఆరోజన్న మాటలే నా జీవితాన్ని పూర్తిగా మార్చివేసాయి. గ్రూప్-1 ఆఫీసర్ అయిన నాకు, అరటిపళ్ళమ్మే ఆ కుర్రాడికి సంబంధమేంటని అనుకుంటున్నారా? ఉంది. సంబంధం ఉంది. గతం తాలూకు జ్ఞాపకాలు ఒక్కొక్కటీ నా కళ్ళముందు సాక్షాత్కరించాయి. సరిగ్గా పదేళ్ళక్రితం సంగతి.

మాది మధ్యతరగతి కుటుంబం. మేము ఐదుగురిమి. నలుగురుం మగాళ్ళు. ఒక ఆడపిల్ల. మా నాన్నకి మా తాతిచ్చిన ఆస్తులేమీ లేవు. మొదటినుంచీ మా నాన్న అరటిపళ్ళ బండివేసి, ఆ వచ్చిన వాటితోనే ఇంటిని గడిపేవాడు. ఇంట్లో నేనే పెద్దాడిని. 'బియ్యే' వరకు చదివాను. మా రెండోవాడు చదువు సొంతం మానేసి అరటిపళ్ళ బండి వేస్తున్నాడు. అదేంటో వాడు ఎనిమిదో, తొమ్మిదో చదివేటప్పుడు, వాడే ఒకరోజు సడన్‌గా చదువు మానేస్తానన్నాడు. దానికి మా నాన్న, ''మానిపారనూకరా! అంత కష్టంగా ఉంటే. రేపట్నుంచి బండెయ్యి మరి. ఖాళీగా లేకుండా'' అన్నాడు. ''సరే''నన్నాడు మావాడు. నేను డిగ్రీ పూర్తి చేసే నాటికే మా వాడికి అరటిపళ్ళు అమ్మడంలో ఆరేళ్ళ అనుభవం సంపాదించాడు. నేను డిగ్రీ చదివేటప్పుడు, సెలవుల్లో మావాడ్ని భోజనానికి పంపేందుకు, ఆదివారాలు రెస్టు ఇచ్చేందుకు బండిదగ్గర ఉంటుండేవాడ్ని. ఏదో అమ్ముతానులేగాని, వాడు అమ్మినట్లుగా రేట్లు అమ్మలేను.

బియ్యే ఫస్టుక్లాసులో పాసయ్యాను. పైకి గంభీరంగా ఉన్నా, నేను డిగ్రీ ఫస్టు క్లాసులో పాసయ్యాననే విషయం తెలిసి మా నాన్న ఎంతో మురిసిపోయాడు. బండి దగ్గరికి వచ్చేవాళ్ళతో, ''కష్టపడి చదివించాను మరి. నా రెక్కల కష్టం ఊరికే పోతుందా?'' అని గర్వంగా చెప్పుకోవడం నేను విన్నాను. ''మరేందిరా? ఇంకా చదువుతావా? ఉజ్జోగం ఏదయినా చూసుకుంటావా? అడిగాడు నాన్న. సమాధానం ఏమీ చెప్పలేదు. డిగ్రీ అయ్యి మూడు నెలలు అయిపోయాయి. ఒక్క ఉద్యోగం కూడా రాలేదు (చేరలేదు). నా క్లాస్‌మేట్స్ అందరూ ఉద్యోగాలు చూసుకున్నారు. కానీ నేను నాలుగోనెలయినా ఏ ఉద్యోగంలోనూ చేరలేదు. ఉద్యోగమంటే ప్రయివేటుదే. గవర్నమెంటు ఉద్యోగాలు మనకేడొస్తాయి? రిజర్వేషనా లేదు, పోటీ పరీక్షలతో పోటీపడే ఓపికా లేదు. అయిదో నెల కూడా అయిపోయింది.

''డిగ్రీ అయి ఆరు నెలలయింది కదా! ఇంకా ఏదోటి సూసుకోకపోతే ఎలారా? సదువుకున్నవాడివి, నీకు తగ్గది ఏదయినా సూడరా! పరిస్థితులు బాగుంటే పెళ్ళి కూడా కానిద్దువు'' మా అమ్మగోల. మావాడు వ్యాపారంలో మంచిగ రాణించడంతో మా నాన్న ఆదాయానికి తోడు మావాడి ఆదాయం మమ్మల్ని ఆర్థికంగా కొంచెం బలోపేతం చేసింది. దాంతో మంచి డాబా ఇల్లేసాము. ఇంటిపనిలో పడి మన ఉద్యోగం సంగతి మరచిపోయారు కొన్నాళ్ళు. డిగ్రీ అయి సంవత్సరం దాటింది. మావాడు నాకన్నా గైరుగా ఉండటంతో, అదీగాక వ్యాపారంలో బాగా సంపాదిస్తున్నాడనిన్నీ వాడికి పెళ్ళి సంబంధాలు రాసాగాయి. దాంతో మా అమ్మ నాపై మరీ విరుచుకుపడింది. ''నీకన్నా సిన్నోడు వ్యాపారం చేసి, నాలుగు డబ్బులు సంపాయిత్తావుంటే, నీవెంత కాలం ఏమీ సెయ్యకుండా ఉంటావురా? సదుమయి సంవత్సరమయింది. తోటోళ్ళు చేసుకోవటంలేదు ఉజ్జోగాలు. వయసులోనే నాలుగురాళ్ళు వెనకేయాలి. ఇవాళ వచ్చిన రూపాయి రేపురాదుగందా!'' అని పెద్ద పెద్దగా అరిచింది. వినపడనట్లుగానే ఊరుకున్నాను.

తోటోళ్ళు చేస్తున్నారులే ఉద్యోగాలు. ప్రొద్దున్నే ఏడు గంటలకు ఉడికీ ఉడకని అన్నం గట్టుకుని బయల్దేరతారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి, రాత్రి ఏడు గంటల వరకు అరవ చాకిరీ చెయ్యాలి. ఇచ్చేది ఎనిమిదొందలో, పదొందలో. బస్సు ఛార్జీలకే మూడొందలు లేచిపోతాయి. ఇంతోటి ఉద్యోగానికి రోజూ ప్రొద్దున్నే వంటలు, ఇస్త్రీబట్టలు, లెదరు చెప్పులు. ఇలా అన్ని ఖర్చులూపోను మిగిలేది మూడొందలు, జాగ్రత్తగా వాడితే నాలుగొందలు. పోనీ ఉద్యోగమేమైనా స్థిరమయినదనుకుంటానికా అదీకాదు. మనక్కోపమొచ్చినా, వాడిక్కోపమొచ్చినా మనమే పోవాలి. సంవత్సరం చేసి, సీనియారిటీ సంపాదించి, రెండొందలు జీతం పెరిగిందనుకుంటే ట్రాన్స్‌ఫర్‌లు. వెళ్ళనని మొండికేస్తే ఊస్టింగు. అలాంటి ఉద్యోగాలు చేస్తే ఎంత! చేయకపోతే ఎంత! అని నా ఆలోచన.

డిగ్రీ అయి సంవత్సరం, ఆరునెలలయింది. ఇంట్లో పోరు రోజురోజుకీ పెరిగిపోతున్నది. భరించలేక రెండు, మూడు ప్రయివేటు ఉద్యోగాల ఇంటర్వ్యూలకి వెళ్ళాను. ఇంటర్వ్యూ అవగానే అర్థమయిపోయింది నాకు ఆ ఉద్యోగం రాదని. మిగిలిన రెండు ఉద్యోగాలు తర్వాత కబురు చేస్తామని చెప్పడంతో, చిన్నఆశతో ఎదురుచూసాను. రెండు నెలలు దాటింది. కబురూ లేదు కాకరకాయ లేదు. ''ఏమిట్రా ఆటికి ఎల్లొచ్చావు. కబురేమీ పెట్టలేదు. ఇంకా ఏదయినా ప్రయత్నిస్తున్నావా, లేదా?'' అమ్మ అరుపులు. నేనేమీ మాట్లాడలేదు. ''ఏ విషయమూ ప్రాణం పోయినా సెప్పడుగందా! మంచయినా, చెడయినా ఏదీ చెప్పకుండా అలా నిస్సద్దంగా ఉంటాడు. పోనీ ఇదిగో ఇది సేత్తాను. అది సదువుతానని అనడు. బియ్యే తర్వాత ఎమ్మేకి కాలేజీకి వెళ్ళనులే, పెరివేటుగా సదువుతానని ఎందొందలు కట్టొచ్చాడు. తోటోళ్ళు కూడా ఇలాగే ఉంటున్నారా? ఏదోటి సేసుకోవట్లే. బొత్తిగా చొరవలేదండి మన పెద్దోడికి'' అంటూ ఆందోళనగా చెప్పింది మా అమ్మ నాన్నతో.

ఆయన ఏమీ మాట్లాడలేదు. కానీ ఆ రాత్రి భోజనం చేసాక, నిద్రపోకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు నాన్న. నాకయితే ఆక్షణంలో 'చిన్నపాటి ఉద్యోగమైనా రాలేదేంటా' అని బాధవేసింది. తెల్లవారింది. మావాడికి చలిజ్వరం. ప్రొద్దున్నే లేవలేకపోయాడు. వాడికోసం బండిమీద గెలలు రెడీగా ఉంచుంటారు. ఇక 'మనమే

బండి దగ్గరుండాలి వీడికి తగ్గేదాకా' అనుకుంటూ లేచాను.


అలా బండి దగ్గరికి వెళ్ళిన నేను ఆర్నెల్లపాటు అలాగే ఉండాల్సొచ్చింది. మావాడికి ఒక పట్టాన తగ్గలేదు.

నేను కూడా వ్యాపారానికి బాగా అలవాటు పడిపోయాను. బాగా లాభాలేమీ రాకపోయినా, రోజుకి మినిమం వంద రూపాయలొచ్చేవి. ప్రొద్దున్న, సాయంత్రం టిఫినూ, మధ్యమధ్యలో టీలు, వారానికి రెండు, మూడు సినిమాలు... ఇలా ఒక ప్రయివేటు ఉద్యోగస్తుడు నెలకు సంపాదించేది, నేను బండి దగ్గరుంటే ఖర్చులుగా అవుతాయి. అందుకేనేమో ప్రయివేటు ఉద్యోగం చేయాలన్న ఆలోచన నశించిపోయింది. వారికి మల్లే ఇస్త్రీ బట్టలు, లెదరు చెప్పులు వేసుకోకపోయినా, కడుపు కట్టుకోకుండా బ్రతుకుతున్నాననిపించింది.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి. మధ్యలో చిన్న చిన్న అవాంతరాలు, అవమానాలు. అయినా అలాగే నెట్టుకొచ్చాను. మొదట్లో మా క్లాస్‌మేట్స్, మాష్టర్లు వింతగా చూసేవారు. ఆ తర్వాతర్వాత అలవాటు పడిపోయారు. వాళ్ళు కూడా వచ్చి పళ్ళు తీసుకెళ్తుండేవారు. రోజూ సాయంత్రం ఎవరో ఒకరు బండి దగ్గరికి వచ్చి కూర్చునేవారు. వాళ్ళతో ఏదో ఒకటి మాట్లాడుతూ కాలక్షేపం చేస్తుండేవాడిని. మధ్య మధ్యలో రెండు బళ్ళఅవతల వుండే మావాడి సూచనలు. ''ఇలా అమ్ము, అలా అమ్ము. ఆ రేటుకిచ్చావేంట్రా. ఇక ఇలా అయితే వ్యాపారం చేసినట్లే'' రొటీన్ అయిపోయాయి ఇలాంటి మాటలు. తెలిసిన వాళ్ళకి కూడా ఒక రూపాయి తగ్గించి ఇస్తే ఊరుకునేవాడు కాదు. ఒకరోజు పట్టీ తక్కువ వచ్చిందట. రేట్లు సరిగా నడవలేదు. అన్‌సీజను. దానికి మావాడు, ''ఏం అమ్మకంరా బాబూ. చదువుకున్నావు ఎందుకురా? తెలివితేటలుగా అమ్మాలి. బేరం పోనీకూడదు. ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కూచుంటావు. కుర్రాళ్ళతో కబుర్లు. నీ పట్టీకి, నా పట్టీకి ఎంత తేడానో చూడు. నా దాంట్లోంచి వంద రూపాయలు లాభం తీశాను. నీదాంట్లోంచి లాభం తీయడానికి ఏమీ మిగల్లేదు. పట్టీ మొత్తం కట్టాల్సొచ్చింది. జాగ్రత్తగా అమ్ము'' కేకలు పెట్టినట్లే చెప్పాడు.

చివుక్కుమనిపించింది నాకు వాడన్న 'చదువుకున్నావు ఎందుకురా?' అనేమాటకు. ఎందుకంటే చదివిన చదువు, సబ్జెక్టులో మనకు ఉండే పట్టు, నాలెడ్జి, ఇవన్నీ ఊరికేపోవు అని నా గట్టిన మ్మకం.

ఇదే విషయం నాతో క్లోజ్‌గా ఉండే మా లెక్చరరొకాయనతో చెప్పబోయాను. ఆయన, ''చూడు మాధవా! నీలా బాగా చదువుకున్నవాడు, ఏమీ చదువుకోనివాడు కూడా చేయగల పనులను ఆశ్రయించటంవలన, ఇలా అందరితో 'మాటలు పడాల్సివస్తోంది. అరటిపళ్ళు అమ్మడానికి ఎమ్మే చదవనవసరం లేదు. కానీ నువ్వు ఐ.ఎ.ఎస్. పరీక్షకు ఇచ్చే ప్రశ్నాపత్రాన్నయినా కనీసం అర్థం చేసుకుంటావు. కానీ మీవాడో- అది అందరూ చేయలేనిపని. కాబట్టి అరటిపళ్ళమ్మద్దనీ చెప్పను. ఇలాగే ఉండిపొమ్మనీ చెప్పను. నీ శక్తేమిటో నిర్ణయించుకుని ఏదో ఒకటి చెయ్యి.'' అన్నారు.




ఆయన అన్న 'ఏదో ఒకటి చెయ్యి' అనే మాటలో మాత్రం ఇంకా ఎక్కువకాలం దీన్ని కంటిన్యూ చేయొద్దనే శబ్దం నాకు వినబడింది. అది నా మస్తిష్కంలో డిటిఎస్ సౌండ్ సిస్టమ్‌కన్నా ఎక్కువగా మారుమ్రోగింది రెండు రోజులపాటు. ఆలోచిస్తున్నాను. కానీ ఏం చేయాలో తోచడంలేదు. పాతికేళ్ళొస్తున్నాయి. రాజీపడి ఉండిపోదామన్పించింది. కాని ఆ తర్వాతరోజు జరిగిన సంఘటనే నన్నలా అనుకోకుండా చేసింది.

మర్నాడుదయం టిఫిన్ అయ్యాక, టీ త్రాగుతూ బండి దగ్గర నిల్చున్నాను. ఎనిమిదిన్నర కావస్తోంది. ఒక పదిహేనేళ్ళ కుర్రాడు అరటిపళ్ళ బండి తోసుకుంటూ వస్తూ కన్పించాడు. వాడు నాకు తెల్సు. ఇదివరకో సారి మాట్లాడినట్లు గుర్తు. అప్పుడడిగితే చదువుకుంటున్నానని చెప్పాడు. మరి బండి తోసుకొస్తున్నాడేమిటి? అని అనుకుంటూ, వాడ్ని దగ్గరికి పిలిచాను. వాడు వచ్చాడు.

''ఏంటన్నా! పిలిచావు'' అన్నాడు వాడు దగ్గరికి వచ్చి. ''ఏమిరా! ఇవ్వాళ బడిలేదా ఏమిటి?'' అడిగాను. ''ఉందన్నా'' చెప్పాడు. ''మరి బండేశావేమిరా?'' మళ్ళీ అడిగాను. ''బడి మానేశానుగా'' అన్నాడు తాపీగా. ''అదేంట్రా చదువు మానకురా. పదిదాకానైనా చదువుకోరా'' అన్నాను మందలింపుగా. దానికి వాడు, ''ఆ! నువ్వు డిగ్రీకి పైన చదివినావంటగదా! అయినా నువ్వు అరటిపళ్ళు అమ్మట్లే. అదేదో నేను ఇప్పట్నుంచే చేసినాననుకో, మీ తమ్ముడికి మల్లే అనుభవం అయ్యిద్దిగా'' అన్నాడు.

నోట మాటరాలేదు నాకు. ఇకవాడికి నేను ఇక్కడ, ఈ పొజిషన్లో ఉండి చదువు గురించి ఏమీ చెప్పలేనని, చదువంటే ఒక పనికిరాని వస్తువనే భావన

## ఇష్టమైన దేవుళ్ళు



★ దేవుడంటే అందరికీ నమ్మకం ఉన్నా, ప్రత్యేకంగా ఓ దేవుడంటే ప్రతి వ్యక్తికీ ఓ నమ్మకం, ఇష్టం ఉంటాయి. మనలాగే సినీ జనాలకి కూడా ఒకే దేవుడంటే ఇష్టం, నమ్మకం. ఇప్పుడు ఏ దేవుడు, ఎవరికిష్టమో చూద్దాం.

★ మోహన్‌బాబు సాయిబాబా భక్తుడు.

★ రాజేంద్రప్రసాద్‌కి అయ్యప్పస్వామి అంటే గురి.

★ తిరుపతి వెంకటేశ్వరస్వామి అంటే కోడి రామకృష్ణకి నమ్మకం.

★ ప్రతి మంచి మనసున్న వ్యక్తీ దేవుడే అంటాడు ప్రకాష్‌రాజ్.

★ శ్రీకృష్ణుడు అంటే నాకెంతో భక్తి అంటుంది రమాప్రభ.

★ అన్నవరం సత్యన్నారాయణ స్వామి అంటే చాలా నమ్మకం అంటారు గుండు హనుమంతరావు.

పర్లేదు. నమ్మకం అంటూ ఉంటే ఏ దేవుడైనా చల్లగానే చూస్తాడు. కదండీ!

- విరాజి




వాడి మనసులో పాతుకుపోయిందనీ నాకు అర్థమయింది.

కానీ వీడి మాటలు, మా లెక్చరరుగారన్న మాటలకన్నా ఎక్కువగా ఆలోచింపజేశాయి. ఎమ్మేదాకా చదివి, అరటిపళ్ళ బండి దగ్గర ఉంటున్న నేను, అర్థాంతరంగా ఒక కుర్రాడు చదువు మానెయ్యడానికి ఆదర్శంగా మిగిలానా? అన్న ఆలోచన నన్ను మరింత ఉద్వేగభరితుడ్ని చేసింది. ఇంక లాభం లేదు.

నేను ఇదే పొజిషన్లో ఉంటే, నన్ను ఆదర్శంగా తీసుకుని ఎంతమంది చదువుమానేస్తారోనన్న భయం పట్టుకుంది. అదే నన్ను ముందుకు నడిపించింది. ఏదో ఒకటి చేసి, చదువుకున్నవాడికి, చదువుకోనివాడికి మధ్యనున్న వ్యత్యాసాన్ని ఎలుగెత్తి చాటాలనిపించింది. వెంటనే నా ఆలోచనకు కార్యరూపం ఇవ్వదలిచాను.

అదృష్టమో, యాధృచ్ఛికమో తెల్లారే పేపర్లో పదేళ్ళ నుంచీ ఆగిపోయిన గ్రేడ్-1 నోటిఫికేషన్ పడింది. అంతే- నాలుగురోజుల తర్వాత డబ్బులు చూసుకుని బ్యాంకుకు వెళ్ళి, అప్లికేషన్ కొని, డి.డి.తీసి, అప్లికేషన్ ఫిల్‌చేసి పంపించేసాను. కావలసిన పుస్తకాలన్నీ అంతకుముందు కొద్దోగొప్పో దాచిన డబ్బుల్తో కొనుక్కుని, అన్నీ బండిదగ్గరే పెట్టాను. ఖాళీ దొరికినప్పుడల్లా చదవటం మొదలుపెట్టాను. ఎమ్మె కూడా ఇలాగే బండి దగ్గరే చదివి, రెండేళ్ళలో చేయాల్సిన దానిని నాలుగేళ్ళలో అయిందనిపించాను. కానీ ఇది అలా కాదు. ఎంత కాంపిటీషన్ ఉంటుందో తెలుసు. కోచింగ్ తీసుకునేందుకు కుదరదు కాబట్టి, మా ఫ్రెండొకడు కోచింగ్ తీసుకుంటుంటే వాడిదగ్గర మెటీరియల్ తీసుకుని చదివాను.

ఎగ్జామ్‌కి ఇంకా నెలాపదిహేను రోజులు మాత్రమే ఉంది. టైము సరిపోవడంలేదు. రాత్రిపూట కూడా చదవటం ప్రారంభించాను. ఇదివరకు నిద్రచాలదని రాత్రిపూట చదివేవాడిని కాదు. కానీ ఇప్పుడు ఆరు గంటల నిద్రాసమయాన్ని నాలుగు గంటలకు కుదించాను. ఆ రెండుగంటలూ సమర్థవంతంగా వినియోగించుకోవటం ద్వారా కొంత కవర్ చేయగలిగాను. ఎగ్జామ్‌కి ఇంకా నెలరోజులే ఉంది. కాలెండర్‌లో డేట్ చూసాను. సరిగ్గా నెలరోజులు. బండి దగ్గరికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను. నావాటా గెలలు తీసుకోవద్దని నాన్నతో చెప్పేను. ఆయనేమీ మాట్లాడలేదు. ఇంట్లో మాత్రం మూడురోజులు ఒకటే గొడవ పెట్టారు. ''బండెందుకు మానేశావురా'' అని. సమాధానం చెప్పలేదు. నా పనిలో నేను నిమగ్నమైపోయాను.

టెన్షన్, ఆదుర్దా తగ్గించుకునేందుకు ధ్యానం చేయటం మొదలుపెట్టాను. ఇప్పుడు నా మనస్సులో ఒకటే లక్ష్యం. ఎ.పి.పి.ఎస్.సి. గ్రేడ్-1 పోస్ట్‌కొట్టాలి. సాధిస్తానా? సాధించగలనా? అనే ప్రశ్నలేవీ నా మనసులో లేవు. 'సాధించాలి' అన్న పట్టుదల తప్ప.

ఎగ్జామ్ రేపే. ఆ ముందురోజంతా రివిజన్‌లో కవర్ అయిన టాపిక్స్ అన్నీ మళ్ళీ చూసుకున్నాను. సాయంత్రం నాకు తెలిసిన మాష్టారు దగ్గరికి వెళ్ళి, ఎగ్జామినేషన్ హాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, టైమ్ మేనేజ్‌మెంట్, స్పీడ్ అండ్ యాక్యురసీ మీద సలహాలు తీసుకున్నాను.

తెల్లవారితే ఎగ్జామ్. నైటేమీ చదవలేదు. పూర్తిగా రెస్టుతీసుకున్నాను. తెల్లవారుజామున నాలుగ్గంటలకే లేచి, ఆరింటివరకూ ప్రిపేరయ్యాను. తర్వాత స్నానం, టిఫిన్ ఇత్యాది కార్యక్రమాలు ముగించుకొని, హాల్ టిక్కెట్ తీసుకుని ఇంట్లోంచి బయటపడ్డాను. మా సందు మొదట్లోనే విఘ్నేశ్వరుడి గుడి. చిన్నతనంలో గుడికేమైనా వెళ్ళానేమోలేగానీ, పెద్దయి యుక్తవయస్సు వచ్చిన తర్వాత గుడికి వెళ్ళలేదు. దేవుడిమీద నాకు ఒకరకంగా నమ్మకం లేనట్లే చెప్పొచ్చు. అదేంటో ఆరోజు మాత్రం సందు మొదటికి రాగానే నాచేతులు అప్రయత్నంగా గుడివైపుకి తిరిగి నమస్కరించాయి.

ఎగ్జామ్ అయిపోయింది. ఎగ్జామ్ బాగానే రాశాను. ప్రిలిమ్స్ అయిపోవచ్చు అనిపించింది. అలాగే- జరిగింది. తర్వాత మెయిన్స్‌కి దీనికి రెండింతలు కష్టపడ్డాను. ఫలితం దక్కింది. ఇంటర్వ్యూ కూడా గట్టెక్కాను. ఎక్కడో- వేరే జిల్లాలో పోస్టింగు. ఇదిగో పదేళ్ళకి, ఇప్పటికి సొంతవూరికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. సాయంత్రం ఆ కుర్రాడిని చూడటం, ఒక్కసారి గతంలోకి వెళ్ళడం జరిగింది. రాత్రి రెండుగంటలు దాటింది. గతం తాలూకు జ్ఞాపకాలతో టైమ్ తెలియలేదు. తెల్లారితే ఆదివారమేగా అని నా ధైర్యం. నిద్ర కూడా రాలేదు.

ఆఫీసర్‌నయిన తర్వాత, ఒకసారి ఆ చదువు మానేసి, అరటిపళ్ళమ్ముతున్న వాడికి కనబడి చెప్పాలనుకున్నాను. కానీ కుదరలేదు. ఉదయం తొమ్మిదిగంటలకల్లా స్నానం, టిఫిన్ కానిచ్చి, బండి బయటకు తీసాను. ఎప్పుడెప్పుడు వాడ్ని కలుసుకుంటానా అని ఆత్రుతగా ఉంది. 'అరటిపళ్ళమ్మే మాధవ'గాడి'కి, ఆఫీసర్ మాధవరావుకి మధ్యవున్న తేడా ఏమిటో వాడికి తెలియజెప్పాలని ఉంది. అంతేకాకుండా వాడు నా విషయాన్ని వాడికి తెలిసిన వందమందితో చెబితే, అందులో పదిమందికైనా నేను స్ఫూర్తిగా మిగుల్తానని నా ఆశ. బండి స్టార్ట్‌చేసి, మా ఇంటి ముందుండే నేమ్ బోర్డ్‌వైపు చూసాను. గర్వంగా, 'మాధవరావు ఎం.ఎ.' అనే అక్షరాలు నాకంటే గర్వంగా చూస్తున్నట్లనిపించింది.

★